క్లుప్తంగా

నగర పంచాయతీ మేనేజర్‌గా సువర్ణ లక్ష్మి

బేతంచెర్ల: స్థానిక నగర పంచాయతీ మేనేజర్‌గా సువర్ణలక్ష్మి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఆమె వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. నగర పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

బాక్సింగ్ పోటీల్లో రజత పతకం



సిల్వర్ మెడల్ అందుకుంటున్న అర్చన

ప్యాపిలి: పట్టణానికి చెందిన మెట్టుపల్లి అర్చన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చాటింది. శనివారం విశాఖపట్నంలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు నిర్వాహకుల చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకుంది. అర్చనను ప్యాపిలి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పీఈటీ విజయలక్ష్మిఅభినందించారు.

వేడుకగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటలో వెలసిన రేణుకా ఎల్లమాంభేశ్వరి ఆలయ 19వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఏఈ నాగరాజు ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు, మంగళహారతులు సమర్పించారు. భక్తులు అమ్మవారికి చీరసారె, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు శివరామిరెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. జిందాల్ కంపెనీ ఉద్యోగి గంగాధర్‌రెడ్డి, రాజా టాకీస్ సోదరులు మల్లికార్జునగౌడ్, మహేష్‌గౌడ్, శేషన్నగౌడ్ అన్నదానం చేశారు.

ఘనంగా వేంకటేశ్వరుడి విగ్రహ ప్రతిష్ట



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

బనగానపల్లె రూరల్: పలుకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శనివారం శాస్త్రోక్తంగా జరిగింది. గురుమూర్తిశర్మ ఆధ్వర్యంలో ఉదయం 8.15 గంటలకు విగ్రహ ప్రతిష్ట జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు కాటసాని తిరుపాల్‌రెడ్డి, గుండం నాగేశ్వరరెడ్డి ఉన్నారు.

వైభవంగా వేణుగోపాలుడి విగ్రహ ప్రతిష్ట

ప్యాపిలి: మండల పరిధిలోని ఏనుగుమర్రి గ్రామంలో శనివారం వేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భూమి పూజ

డోన్: మండలంలోని ఉంగరానిగుండ్ల గ్రామంలో ఏర్పాటు చేస్తున్న చెరువుకు శనివారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి భూమి పూజ చేశారు. అలాగే వెంకటాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు.

రేపటి నుంచి యోగాంధ్ర పోటీలు

బనగానపల్లె రూరల్: మండల స్థాయిలో ఈ నెల 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరిగే యోగాంధ్ర పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ యూనాని వైద్యశాల మెడికల్ ఆఫీసర్ రహిమాన్, యోగా మాస్టర్లతో సమావేశమయ్యారు. ఆయా తేదీల్లో జూనియర్స్, యంగ్, సీనియర్స్ యోగాంధ్ర పోటీల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

డోన్: రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త సూగన్న, కేవీకే శాస్త్రవేత్త రమణయ్య అన్నారు. మండల పరిధిలోని ఎద్దుపెంట, ఓబులాపురం, దేవరబండ గ్రామాల్లో శనివారం వివిధ పంటల సాగు, విత్తనశుద్ధి, తెగుళ్లు, పురుగుల మందులు, సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో బీజామృతం తయారీ విధానాన్ని వివరించారు.

సాగు వేళ.. రైతు డీలా

- నేటి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం
- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ
- అనుకూలంగా ముందస్తు వర్షాలు
- ప్రభుత్వం నుంచి సాయం కరువు
- పెరిగిన ఖర్చులతో ఆందోళన

ఈ ఏడాది నైరుతి పవనాలు ముందుగానే పలకరించాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. దుక్కులు చేసి పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. అయితే పెరిగిన విత్తనాల ధరలు, ఎరువులు, పురుగుల మందులు, కూలీ ఖర్చులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీనికి తోడు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదు. గతంలో వస్తున్న పెట్టుబడి సాయం కూడా అందని పరిస్థితి. ఎలాగోలా సాగుచేస్తామంటే మద్దతు ధర ఉంటుందన్న గ్యారెంటీ లేదు. ఎప్పటిలాగే నేలమ్మను నమ్ముకుని ఆశల సాగుకు సమాయత్తం అవుతున్నారు.

సంజామల: ఈ ఏడాది ముందస్తు వర్షాలు రైతన్నకు ఊరట కలిగిస్తున్నాయి. జూన్ 1న ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్‌కు ముందస్తు వర్షాలు అనుకూలించడంతో రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. రైతన్నలు వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. బనగానపల్లె నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం 24,974 హెక్టార్లుగా ఉంది. సీజన్ నేటితో ప్రారంభం అయినా కూటమి ప్రభుత్వం నుంచి రైతులకు ఎరువులు, విత్తనాల ఊసేలేదు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రైతు సేవలను నిర్వీర్యం చేసింది. ఏటా పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు ఇస్తామని చెప్పి కాలయాపన చేస్తోంది. గత ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలకు కోతలు పెడుతూ వస్తోంది. రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసింది. కియోస్క్ మిషన్లను మూలన పడేసింది.

గత ప్రభుత్వంలో రైతులకు భరోసా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుకు అండగా నిలిచింది. ప్రతి సీజన్‌లో రైతుకు సాయం అదించేది. రైతు భరోసా ద్వారా ఏటా రూ.13500 అందించేది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు పింపిణీ చేసేది. పంటలో ఏదైనా నష్టం వాటిల్లితే పరిహారం అందించేది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు అందించి తోడ్పాటునందించింది. వ్యవసాయాన్ని పండుగలా మార్చింది. ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతన్నా రైతన్నకు సాయం మరిచింది. పెట్టుబడి సాయం ఇస్తామని ఆశ చూపి కాలయాపన చేస్తోంది. రైతుకు కనీసం విత్తనాలను కూడా అందుబాటులో ఉంచని పరిస్థితి నెలకొంది. వ్యవసాయం దండగలా మార్చింది.



ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు (ఫైల్)

కలసిరాని 2024–2025 ఖరీఫ్, రబీ సీజన్లు

గత ఏడాది బనగానపల్లె నియోజకవర్గంలో అన్నదాతలు నష్టపోయారు. మద్దతు ధర లేమి, వర్షాభావ పరిస్థితులు, అకాల వర్షాలు, పెరిగిన ఖర్చులు మిరప, మినుము, మొక్కజొన్న, వరి, పొగా రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. కూటమి ప్రభుత్వం మేలుచేస్తుందని అనుకుంటే నిలువునా ముంచిందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాదిలో పంట గిట్టుబాటు, అన్నతదాతకు పెట్టుబడి సాయం, సబ్సిడీ విత్తనాలు, పంట నష్టం, ఎరువుల పంపిణీ చేయడంలో కూటమి ప్రభుత్వ ఘోరంగా విఫలమైంది.

బనగానపల్లె నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం

మండలం	విస్తీర్ణం (హెక్టార్లలో)
బనగానపల్లె	6566
అవుకు	7752
కోవెలకుంట్ల	3483
సంజామల	4712
కొలిమిగుండ్ల	2461

రైతులు దివాలాతీసే పరిస్థితులు నెలకొన్నా ప్రభుత్వం స్పందించడం లేదు.

గతేడాది నష్టపోయాం



మాకు వ్యవసాయమే జీవనాధరం. పంటలు బాగా పండితే జీవితం సంతోషం, లేకుంటే ఆ ఏడాది నష్టాలు, కష్టాలు తప్పవు. గత ఏడాది పంట సరిగ్గా రాక.. ప్రభుత్వ గిట్టుబాటు ధర కల్పించక తీవ్రంగా నష్టపోయాం. మిరప, మినుము పంటల్లో అనుకున్న దిగుబడి రాలేదు. విత్తనాల ఎంపిక, పంట సంరక్షణ, క్రిమిసంహారక మందులు వెచ్చించినా మొత్తం వృథా అయింది. గత ఏడాది నష్టాలే మిగిలాయి. ఈ ఏడాదైనా పంటలు కలిసివస్తుందని ఆశిస్తున్నాం.

–సత్యమయ్య, రైతు, వసంతాపురం

రైతుకు పెట్టుబడి సాయం అందించాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతన్నా రైతుకు పెట్టుబడి సాయం అందించ లేదు. ఈ ఏడాది అయినా అందిస్తే బాగుంటుంది. గత ప్రభుత్వంలో సీజన్ ముందే రైతు భరోసా కింద రూ.13,500 ఖాతాల్లో పడేది. రైతుకు అన్ని విధాలుగా అండగా నిలిచింది. 2024–25 సంవత్సరం రైతన్నకు శాపంగా మారింది. రైతు వేసిన ప్రతి పంట రైతుకు నష్టం మిగిల్చింది.

–గూటిపల్లె తులసిరెడ్డి, రైతు, ఆకుమల్ల

పౌర హక్కులను పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల: పౌర హక్కులను పరిరక్షించుకోవాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. సివిల్ రైట్స్ డేను పురస్కరించుకుని శనివారం మండలంలోని గుంజలపాడులో అధికారులు పర్యటించారు. పలు కాలనీల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పౌర హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రెవెన్యూ, గ్రామాల అభివృద్ధి, వ్యవసాయశాఖలకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాదరావు, వ్యవసాయాధికారి నిరంజన్, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



పలుకూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. పలువురు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అవుకులో 91శాతం పింఛన్ల పంపిణీ

అవుకు: మండలంలో శనివారం 91 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు మండల పరిపాలనాధికారి శ్రీరాముడు తెలిపారు. మొత్తం 6,592 మంది లబ్ధిదారులు ఉండగా 6007 మందికి సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దే పింఛన్ అందజేశారని.. మిగిలిన లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేస్తామని తెలిపారు.

ప్రజలను మభ్యపెట్టడం టీడీపీ నైజం

- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- జూన్ 4న వెన్నుపోటు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



వెన్నుపోటు కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టడం.. అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం టీడీపీ నైజం అని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులపై పెడుతున్న అక్రమ కేసులకు నిరసనగా ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. శనివారం తన నివాసంలో వెన్నుపోటు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇంకా అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదన్నారు. చిన్నపిల్లలు, మహిళలపై మానభంగాలు, హత్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. ఏడాది పాలనలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై 766 హత్యలు, హత్యాయత్న సంఘటనలు జరిగాయని.. వీరిలో 390 మంది హత్యకు గురైనట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలపై 2,466 అక్రమ కేసులు బనాయించారని.. 500 మందిని అన్యాయంగా జైలుకు పంపారని తెలిపారు. 440 మంది సోషల్ మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టారని.. వారిలో 79 మందిని జైలుకు పంపినట్లు చెప్పారు. ఏడాది కాలంలో ఈ ప్రభుత్వం రూ.1,37,546 కోట్ల అప్పులు చేసిందన్నారు. ఈ డబ్బు సంక్షేమ పథకాలకు అమలు చేయకపోగా ఎక్కడికి పోయినట్లు అని ప్రశ్నించారు.

అన్నింటా బాదుడే

గత వైఎస్సార్ ప్రభుత్వంలో యూనిట్ విద్యుత్ రూ.2.49 పైసలు ఉండగా ఈ ప్రభుత్వం రూ.4.60 పైసలకు పెంచిందని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా నాటుసారా విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణ జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌ను విమర్శించడానికే మహానాడు జరిగిందా అన్నట్లు ఆ పార్టీ నాయకులు వ్యవహరించారని తెలిపారు. నియోజకవర్గంలో దేవుని మాన్యాలు, వక్ఫ్‌బోర్డు భూముల్లో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, నాయకులు అత్తార్ జాహెద్, అబ్దుల్‌ఫైజ్, శంకర్‌రెడ్డి, సిద్ధంరెడ్డి అంబటి రవి కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం



హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలగంగాధర్‌రెడ్డి శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆయన్ను సన్మానించారు. పాఠశాల అభివృద్ధితో పాటు విద్యాభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేసినట్లు కొనియాడారు. ఉపాధ్యాయులు శ్రీనివాసుల రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శివనాగేశ్వరరావు, లక్ష్మీనారాయణమ్మ, శ్రీగౌరి, సులోచన, లక్ష్మీదేవి, నీలిమ తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ ఉద్యోగులను సత్కరిస్తున్న డీఎం

సత్కారం

డోన్ టౌన్: డోన్ ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన నల్లబోతుల నాగేశ్వరరావు, పరిగెల సదాసింగ్, షేక్ మాసుంవలిని డిపో మేనేజర్ శశిభూషణ్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సత్కరించారు. ఐవీఆర్ రెడ్డి, బసవరాజు, శివకుమార్, భగవాన్, నాగరాజు, దాస్, మద్దిలేటి పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



డిపో మేనేజర్ దంపతులను సత్కరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కోవెలకుంట్ల: ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న తిరుపతయ్య శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా డిపో ఉద్యోగులు, కార్మికులు ఘనంగా సత్కరించారు. డిపో డిప్యూటీ సూపరింటెండెంట్లు ఉమామహేశ్వరి, రామయ్య, ఎస్ఎంయూ డిపో కార్యదర్శి శివరాం, ఉద్యోగులు హాఫీజ్, కాశన్న, పక్కీర, పుల్లారెడ్డి, రాముడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

డోన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొచ్చెర్వు గ్రామం వద్ద శనివార చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. బేంతచెర్ల మండలం రహిమాన్‌పురం గ్రామానికి చెందిన తెలుగు సురేష్(26) ప్యాపిలి మండలం చిగురుమాన్ మిట్ట వద్దనున్న అత్తగారి ఇంటికి బైక్‌పై వెళుతున్నాడు. మార్గమధ్యలోని కొచ్చెర్వు సమీపంలో బొలెరో వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య రామలక్ష్మి, కొడుకు శశాంక్, కూతురు సురక్ష ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ హరిప్రసాద్



కోఆప్షన్ సభ్యుడు ఎల్లయ్య, టీడీపీ కౌన్సిలర్ అంజి మధ్య వాదోపవాదాలు

- తాగునీరు, ఇతర సమస్యలపై వాదనలు

బేతంచెర్ల: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన వార్డుకౌన్సిల్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో ముందుగా పట్టణంలో చేపట్టే అభివృద్ధి పనుల నివేదికలను అధికారులు చదివి వినిపించారు. వార్డు కౌన్సిలర్లు తాగునీటి సమస్యతో పాటు, డ్రైనేజీ కాల్వలు, సీసీరోడ్లు, కుక్కల సమస్యలను ప్రస్తావించారు. ఏడాది నుంచి ఆయా కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సంజీవనగర్ కాలనీలో తాగునీటి కొళాయిల నుంచి మురుగునీరు వస్తోందని పత్రికల ద్వారా స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తే పోలీసులతో భయభ్రాంతులకు గురిచేయడం ఏంటని కో ఆప్షన్ సభ్యుడు ఎల్లయ్య ప్రశ్నించారు. ఈ విషయంపై టీడీపీ వార్డు కౌన్సిలర్ అంజి కలగజేసుకుని గతంలో సమస్యలను ఎందుకు అడగలేదు.. ఇప్పుడే గుర్తుకొచ్చాయా అని అనడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తన దృష్టికి వచ్చే ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తానని.. ఇది తప్పా అని ఎల్లయ్య ఎదురు ప్రశ్నించారు. సమస్యలు ఏవైనా ఉంటే నగర పంచాయతీ కమిషనర్ స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కమిషనర్ హరిప్రసాద్ కలగజేసుకుని ఇద్దరికి సర్దిచెప్పారు. పట్టణ సమీపంలోని బలపాలపల్లె రహదారిలో సర్వే నంబర్ 485, 486, 502, ధరణి టౌన్‌షిప్పులోని 183 సర్వే నంబర్లలో లేఔట్లు వేశారని.. నగర పంచాయతీకి ఓపెన్ సైట్ 10 శాతం ఇవ్వలేదని వార్డు కౌన్సిలర్ ఇబ్రహీం అడగగా విచారణ చేస్తామని కమిషనర్ సమాధానం ఇచ్చారు. అనంతరం పట్టణంలో అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపులు, తాగునీటి పైప్ లైన్ల మరమ్మతులు, నీటి తొట్టి నిర్మాణం, కల్వర్టులు, వీధి దీపాలు, సీసీ కెమెరాల ఏర్పాటుకు సుమారు రూ. కోటిపైగా నిధులతో చేపట్టే పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. వార్డు కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి, మధు, కోట్ల మధుసూదన్, షేక్ ముబీనా, హుసేన్‌బీ, అబిదా పాల్గొన్నారు.



ఎస్.చెన్నంపల్లెలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి



బి.ఉప్పలూరులో ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని ఎస్.చెన్నంపల్లెలో టీటీడీ, దాతల సహకారంతో నిర్మించిన ఆలయంలో సీతారామాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా జరిగాయి. వేదపండితుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శనివారం శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ట జరిగింది. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామిని దర్శించుకున్నారు. అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే బిఉప్పలూరులో దాతల సహకారంతో నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. స్వామిని పూలతో అందంగా అలంకరించి విశేష పూజల అనంతరం ప్రతిష్ట చేశారు. కాటసాని, పాపిరెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని ప్రసాద రెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ, టీడీపీ నాయకుడు ఐవీ ఫక్కీరారెడ్డి తదితరులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరిలో సేంద్రియ ఎరువులే ఉత్తమం

బనగానపల్లె రూరల్: వరి సాగులో సేంద్రియ ఎరువులే ఉత్తమమని మహానంది వ్యవసాయ కళాశాలకు చెందిన డాక్టర్ పీవీ గీతా శిరీషా అన్నారు. శనివారం యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో వరిసాగులో సేంద్రియ ఎరువులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రైతులు పర్యావరణానికి అనుకూలంగా ఉండే సేంద్రియ ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పచ్చిరొట్టి ఎరువులైన జీలుగను పొలంలో కలియ దున్నడం వల్ల చౌడుభూములను సమర్థవంతంగా నిరోధించవచ్చన్నారు. డాక్టర్ శివజ్యోతి మట్టి పరీక్షల అవశ్యకత, సమగ్రపోషక యాజమాన్యం తదితర వాటిపై అవగాహన కల్పించారు.

విద్యుత్ సౌకర్యం లేక తెరుచుకోని ఆర్బీకే



నిరుపయోగంగా రైతు భరోసా కేంద్రం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో రైతులకు సేవలు అందించడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించారు. 15 నెలల క్రితమే నిర్మాణం పూర్తయినా కూటమి ప్రభుత్వం ఇంత వరకు విద్యుత్ సౌకర్యం కల్పించని కారణంగా నిరుపయోగంగా మారింది. దీంతో ముందు భాగంలో పిచ్చి మొక్కలు పెరిగాయి. ఇప్పటికైనా విద్యుత్ సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అపరిశుభ్రంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న ప్రాంగణం

బనగానపల్లె: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారింది. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రాంగణంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉంది.